క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, పి.చెల్వరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఏబీ మెడికల్ సర్వీసెస్ సహకారంతో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. గుండె వ్యాధుల నిపుణులు డాక్టర్ పృథ్వీరాజ్ అట్టా, చర్మ వ్యాధులు, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ స్పెషలిస్ట్ డాక్టర్ సిరి, జనరల్ ఫిజీషియన్, ఆర్థరైటిస్, డయాబెటిస్ వ్యాధుల స్పెషలిస్ట్ డాక్టర్ యడ్ల దిలీప్‌రాజ పాల్గొంటారని చెప్పారు. బీపీ, సుగర్ పరీక్షలతోపాటు గుండె సంబంధిత సమస్యలకు సంబంధించి ఈసీజీ, 2డీ ఎకో, ఆర్‌బీఎస్ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. మురళీనగర్ పరిసర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పేద విద్యార్థిని చదువుకు సాయం



బషీరాకు ల్యాప్‌టాప్ అందిస్తున్న కేఎస్ఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ కర్రి మురళీకృష్ణారెడ్డి

సీతమ్మధార: ఓ పేద విద్యార్థినికి కేఎస్ఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సాయమందించింది. నక్కవానిపాలేనికి చెందిన పేద విద్యార్థిని మహమ్మద్ బషీరా నగరంలోని జీవీపీ ఇంజినీరింగ్ మహిళా కళాశాలలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతోంది. విద్యార్థిని తండ్రి టైలర్ వృత్తి చేస్తూ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన కుమార్తె చదువు నిమిత్తం సాయం కోసం కేఎస్ఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఆయన సంప్రదించారు. ట్రస్ట్ చైర్మన్ కర్రి మురళీకృష్ణారెడ్డి వెంటనే స్పందించి శనివారం రేసపువానిపాలెంలోని కార్యాలయంలో విద్యార్థిని బషీరాకు ల్యాప్‌టాప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే చాలా మంది పేదలకు తమ ట్రస్ట్ ద్వారా సేవలందించామని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ట్రస్ట్ అధినేతకు బషీరా కృతజ్ఞతలు తెలిపింది.

వృద్ధుడి అదృశ్యం



తాటిపూడి లక్ష్మణరావు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెంలోని కైలాసపురం కస్తూరినగర్–1లో కుటుంబంతో కలిసి నివసిస్తున్న తాటిపూడి లక్ష్మణరావు కూలి పనులు చేస్తుంటాడు. అప్పుడప్పుడు కూలి పనుల నిమిత్తం ఒడిశా రాష్ట్రానికి కూడా వెళ్తు ఉంటాడు. ఇతడికి మద్యం తాగే అలవాటు ఉంది. ఈ నెల 18న సాయంత్రం 4 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఎంతకీ ఇంటికి చేరుకోకపోవడంతో అతడి కుమార్తె ధనలక్ష్మి కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ మూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

రైల్వేస్టేషన్‌లో 29 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి రవాణాదారులతో జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శనివారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 29 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.మోహనరావు, విశాఖ ఆర్పీఎఫ్ సీనియర్ డీఎస్సీ ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్‌ల ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్ఐ కె.శాంతారాం, ఆర్పీఎఫ్ ఎస్ఐ జీకే మీనా వారి వారి సిబ్బందితో కలసి విశాఖ రైల్వేస్టేషన్‌లోని ఫ్లాట్‌ఫారాల్లో శనివారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన దీపక్‌కుమార్, కమలేష్ షైన్ అనే వ్యక్తులు విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు కనుగొన్నారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది వీరిని అదుపులోకి తీసుకుని, రూ.1.45 లక్షల విలువైన 29 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్ నిమిత్తం వీరిని కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

- విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ‘ఉత్తర’ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- 14వ వార్డులో ప్రచారానికి బ్రహ్మరథం



14వ వార్డులో ఎన్నికల కరపత్రం అందించి ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతమ్మధార: విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటు ద్వారా ఉత్తరాంధ్ర మరింత అభివృద్ధి చెందుతుందని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు వస్తాయని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. 14వ వార్డులో కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో శనివారం పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు. ముందుగా నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని షిర్డీసాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలయ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్ పూలమాల వేసి అభినందించారు. సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్, అభయాంజనేయ స్వామి ఆలయం రోడ్డు మీదుగా పార్టీ కార్యాలయం వరకు ప్రచారం చేశారు. ప్రజలు వారికి హారతులిచ్చి జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ మాట్లాడుతూ ప్రజలందరూ జగనన్న పాలన కావాలని కోరుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతమైన మేనిఫెస్టో విడుదల చేయడంతో ప్రజలు మరింత ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ఫైనాన్స్ హబ్‌గా చేసి, ఎయిర్‌పోర్టు పనులు పూర్తి చేస్తారన్నారు. విశాఖ ఎంపీగా తనను, ఉత్తర ఎమ్మెల్యేగా కె.కె.రాజును ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు.

మళ్లీ పట్టం కట్టండి

కె.కె.రాజు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధి చెందాలని విశాఖను పరిపాలన రాజధాని చేసేందుకు సీఎం వైఎస్ జగన్ కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. ఉత్తరాంధ్ర మరింత అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్‌సీపీకి మళ్లీ పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పేడాడ రమణికుమారి, కాయల సూరారెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు ఆనంద్ సింగ్, పిల్లి సుజాత, మాజీ కార్పొరేటర్లు జి.వి.రవిరాజ్, జి.వి.రమణి, ఆళ్ల శివగణేష్, అంబటి శైలేష్, పార్టీ నాయకులు, డైరెక్టర్లు, కార్యకర్తలు, కన్వీనర్లు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆక్సిజన్ టవర్స్‌లో కె.కె.రాజు ప్రచారం

జీవీఎంసీ 23, 24 వార్డుల పరిధి సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో శనివారం వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు నివాసులు ఘన స్వాగతం పలికారు. ప్రతి ఇంటికీ వెళ్లి మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కె.కె.రాజు కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కరపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఉత్తర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పార్టీ విజయానికి సహకరించి, రెండో సారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను, ఉత్తర నియోజకవర్గంలో తనను గెలిపించాలని ఆక్సిజన్ టవర్స్ వాసులను అభ్యర్థించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు కె.కె.రాజును సత్కరించి మద్దతు తెలిపారు. కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, పి.సతీష్ వర్మ, అశోక్‌రెడ్డి గుడ్ల, నంబాల రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఓటేయండి

జిమ్‌ల్లో కె.కె.రాజు ప్రచారం



అక్కయ్యపాలెం జిమ్‌లో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం అక్కయ్యపాలెం, సీతమ్మధార ప్రాంతాల్లోని పలు జిమ్‌లను సందర్శించారు. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని మారుతి జిమ్, జగ్గారావు బ్రిడ్జి వద్ద ఇండియన్ జిమ్, సీతమ్మధారలోని అభయాంజనేయస్వామి ఆలయం ఆర్చి వద్ద గల ఏబీఎస్ జిమ్‌ల్లో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, గడప గడపకూ అందించిన సంక్షేమాన్ని వివరించారు. ఉత్తర నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులను తెలియజేశారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కె.కె.రాజు కోరారు. ఆనంద్‌సింగ్, రేవతిరావు, ఎం.సునీల్, అంబటి శైలేష్, రాయుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అద్భుతమైన మేనిఫెస్టో



వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోతో కె.కె.రాజు, కోలా గురువులు, చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాస్, కటుమూరి సతీష్ తదితర నాయకులు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం విడుదల చేసిన మేనిఫెస్టో చాలా అద్భుతంగా ఉందని పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఉత్తర పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు ప్రజాసంకల్ప యాత్ర ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని, దానికి అనుగుణంగా మేనిఫెస్టో రూపుదిద్దడమే కాకుండా ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఏకైక సీఎం.. వైఎస్ జగన్ అని కొనియాడారు. అదే స్ఫూర్తితో ఈ ఎన్నికల్లో మళ్లీ విజయం సాధిస్తే ప్రభుత్వం చేపట్టబోయే సంక్షేమ, అభివృద్ధి, మౌళిక వసతులపై అద్భుతమైన మేనిఫెస్టోను ముఖ్యమంత్రి విడుదల చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రస్తుతం అందిస్తున్న సంక్షేమ పథకాలను కొనసాగించడమే కాకుండా ప్రజలకు మరింత ఎక్కువ లబ్ధి చేకూరేలా మేనిఫెస్టోలో చేర్చారన్నారు. దీనిపై ప్రజలకు మరింత నమ్మకం కలిగిందని, ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2014 ఎన్నికల్లో మేనిఫెస్టో పేరుతో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలను మోసం చేశారన్నారు.

ప్రజలకు ఎంతో మేలు

వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంలో భాగంగా రూ.3 లక్షల రుణం, రైతు భరోసా రూ.13,500 నుంచి రూ.16 వేలకు పెంపు, రెండు విడతలుగా పెన్షన్ రూ.3,500 వరకు పెంపు, వైఎస్సార్ కాపు నేస్తం నాలుగు దఫాలుగా రూ.1.20 లక్షలకు పెంపు, జగనన్న అమ్మ ఒడి రూ.17 వేలకు పెంపుతోపాటు తల్లి చేతికి రూ.15 వేలు, వైఎస్సార్ చేయూత రూ.75 వేల నుంచి రూ.1.50 లక్షలకు పెంపు మేనిఫెస్టోతో ప్రజలంతా సంతోషంగా ఉంటారని కె.కె.రాజు అన్నారు. కార్యక్రమంలో ఉత్తర ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, సిక్కు వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ఆనంద్‌సింగ్, వుడా మాజీ చైర్మన్ రవిరాజు, మాజీ కార్పొరేటర్ జి.వి.రవిరాజ్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, ముస్లిం నాయకుడు కె.వి.బాబా, పేడాడ రమణికుమారి, రాయుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల చోరీ

మద్రిపాలెం: ఆటోలో వస్తుండగా ఓ మహిళ హ్యాండ్ బ్యాగ్‌లో బంగారు ఆభరణాలు కలిగిన పర్సు చోరీ జరిగిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఆరిలోవ తోటగురువు ప్రాంతం అన్నానగర్‌లో నివసిస్తున్న విశాలాక్షి అనే మహిళ ఈ నెల 26న కంచరపాలెంలో జరిగిన బంధువుల ఫంక్షన్‌కు వచ్చేందుకు ఆటో ఎక్కారు. ఆమె మధ్యలో సొంత పనులు ఉండటం వల్ల 2 తులాల నెక్లెస్, మూడున్నర తులాల హారం హ్యాండ్ బ్యాగ్‌లోని ఓ పర్సులో పెట్టుకుని, పనులు ముగించుకుని ఓల్డ్ డెయిరీ ఫాం వద్ద ఆటో ఎక్కి, మద్దిలపాలెంలో దిగి.. అక్కడ నుంచి మళ్లీ వేరే ఆటోలో బంధువులతో కలిసి కంచరపాలెంలోని ఫంక్షన్ హాల్‌కు వెళ్లారు. అక్కడ నగలు పెట్టుకుందామని తీరా బ్యాగ్ తీసి చూడగా అందులో ఐదున్నర తులాల బంగారు ఆభరణాలు పెట్టుకున్న పర్సు కనిపించలేదు. అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో విశాలాక్షి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓల్డ్ డెయిరీఫాం నుంచి ఆటోలో వచ్చినప్పుడు తన నగలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించి ఉంటారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో క్రైం ఎస్ఐ జె.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేపట్టారు.

కె.కె.రాజుకు యువత మద్దతు



వైఎస్సార్‌సీపీలోకి యువతను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 26వ వార్డుకు చెందిన యువకులు వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు మద్దతు తెలిపారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ ఉత్తర కార్యాలయంలో శనివారం చిన్నూరుకు చెందిన యువకులు కె.కె.రాజును మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఎన్నికల్లో కె.కె.రాజు విజయానికి తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో నవాబు, బొడ్డేటి కిరణ్, చిన్నూరు యువత పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి బీజేపీ శ్రేణులు



కె.కె.రాజు సమక్షంలో పార్టీలో చేరిన బీజేపీ శ్రేణులు

47వ వార్డు కంచరపాలెం, బాపూజీనగర్‌కు చెందిన పలువురు బీజేపీ శ్రేణులు ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సమక్షంలో శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆయన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేసి పార్టీ విజయనికి కృషి చేయాలన్నారు. ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, కేబుల్ గోవింద్‌రెడ్డి, మక్కా శివ, జి.నాని, కె.ఆదిలక్ష్మి, కె.అనితదేవి, జి.ఎల్లయ్యమ్మ, రామతల్లి, అచ్చియమ్మ, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి పూజలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం విశేష హారతులు సమర్పించారు. ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సుపరిపాలనకు మద్దతిద్దాం



53వ వార్డులో కరపత్రం అందించి ఓటు కోరుతున్న కార్పొరేటర్ బర్కత్ అలీ



49వ వార్డులో కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు



51వ వార్డులో ఓటు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ



25వ వార్డు సీతంపేటలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్



టీపీటీ కాలనీలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి



రెడ్డి కంచరపాలెంలో ప్రచారం చేస్తున్న బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి, నాయకులు

మద్రిపాలెం: వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజులను గెలిపించాలని కోరుతూ శనివారం వార్డుల్లో ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించారు. 50వ వార్డు మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ వార్డు నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం సాగించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సీఎం వైఎస్ జగన్ సుపరిపాలనకు మద్దతు పలకాలని కోరారు.

- 51వ వార్డులోని 240 బూత్ కళింగనగర్ పరిసర ప్రాంతాల్లో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ వార్డు నాయకులతో కలిసి ఉదయం, సాయంత్రం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన బొత్స ఝాన్సీ, కె.కె.రాజులను అందరూ గెలిపించాలని కోరారు. డైరెక్టర్లు పైడి శ్రీను, దిడ్డి రమేష్, ప్రసూనారెడ్డి, బి.తిరుమలరావు, పైడి ప్రతాప్, రాజంరాజు, ఎం.దమయంతి, రాణి, వరలక్ష్మి, ధర్మవతి, శ్యామ్, గణేష్ పాల్గొన్నారు.
- 53వ వార్డు శివనగర్–2, మద్రిపాలెం రైల్వే క్వార్టర్స్, శ్రీహర్షనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం కార్పొరేటర్ బర్కత్ అలీ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి తదితర నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లతో మాట్లాడి విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని, ఉత్తర ఎమ్మెల్యేగా కె.కె.రాజును ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, వార్డు నాయకులు పాల్గొన్నారు.
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందించిన సంక్షేమ పాలనకు ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు కోరారు. ఏఎస్సార్ నగర్‌లో శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కె.కె.రాజుకు మద్దతుగా ప్రచారం

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డులోని 84, 85, 78 బూత్‌ల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు బాణాల తరుణ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంటీసీ పాలెంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. ఉత్తర నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన కె.కె.రాజును గెలిపించాలని కోరారు. డి.వర్మ, హబీబ్, సీతారాములు, బషీర్, సోఫియా, హీరా, వెంకీ, బషీరున్నీషా, రజియా, మణికంఠ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

- 25వ వార్డులో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో కె.కె.రాజుకు మద్దతుగా ప్రచారం చేశారు. శనివారం ఉదయం సీతంపేట కృష్ణుడి గుడి నుంచి, సాయంత్రం హిందూ ముస్లిం కాలనీ నుంచి ప్రచారం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. కమ్మిల నవీన్‌రాజు, నూకరాజు, సానబోయిన సురేష్, వానపల్లి లక్ష్మణకుమార్, బొమ్మాళి రవి పాల్గొన్నారు.

‘ఫ్యాన్’కు ఓటేయండి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు టీపీటీ కాలనీ, పీఅండ్‌టీ కాలనీలు, పలు అపార్ట్‌మెంట్లలో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి కె.కె.రాజును గెలిపించాలని కోరుతూ కరపత్రాలు అందించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు గుడ్ల అశోక్‌రెడ్డి, కె.వినయ్, జొన్నలగెడ్డ నర్సింహం, దల్లి గురుమూర్తిరెడ్డి, బోర రామిరెడ్డి, పోలయ్యరెడ్డి, గుజ్జు లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ విజయాన్ని అందిద్దాం

కంచరపాలెం: విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని, ఉత్తర ఎమ్మెల్యేగా కె.కె.రాజును అఖండ మెజారిటీతో గెలిపించుకుందామని 54, 55 వార్డుల ఎన్నికల పరిశీలకుడు, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. కంచరపాలెం పరిధి రెడ్డికంచరపాలెం, తిక్కవానిపాలెం ప్రాంతాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. వార్డు అధ్యక్షుడు కాయిత పైడి రత్నాకర్, కన్వీనర్లు ప్రసాద్, శివ, సురేష్, శ్రీకాంత్, దుప్పలపూడి శ్రీను, దివాకర్, జామి దాస్, పోలరాజు, లక్ష్మి పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపిద్దాం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు భీమిలి నియోజకవర్గ పరిధి కొండవాలు ప్రాంతాల్లో డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు సూచనలతో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సింగాలమ్మపురం కాలనీలో ప్రతీ ఇంటికి వెళ్లి సార్వత్రిక ఎన్నికల్లో భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. వార్డు ఇన్‌చార్జి జక్కువ రాజగోపాల్ పట్నాయక్, నాయకులు కారుకొండ రాజు, హరిపట్నాయక్, బండారు సుధాకర్, సురేష్, ముప్పిడి రామారావు, ఎల్లాజీ, రవిశంకర్, శేఖర్, దుర్గ, గణపతి, నాయుడు పాల్గొన్నారు.